# మబ్బులు మనసులు

రచన:
శ్రీ బి. ఎల్. చంద్ర

సాయంత్రం 4-30 గంటలు కావొస్తుంది. రాధ కాఫీ కప్పుతో గదిలోనికి ప్రవేశించింది. రవి మాత్రము గమనించలేదు. ఏవో ఊహాలో తేలిపోతూ దీర్ఘముగ ఆలోచిస్తున్నాడు. ఆ ముఖములో కాంతిలేదు. అంధోకారపూరితయై కారుమేఘాలు కప్పిన ఆకాశంలా వుంది రవి ముఖం. నిజము చెప్పాలంటే రవి ఎప్పుడూ అలాగే వుంటాడు. జీవిత వలయాన్ని ఇలాగే లాక్కొనిపోతున్నాడు.

ఏమండీ! కాఫీ...అన్న రాధ మాటలతో ఊహా ప్రపంచమునుండి ఉలిక్కిపడ్డాడు. అయిన పెదవి విప్పలేదు. కనులు పలుకలేదు. మౌనముగా అందుకొన్నాడు కాఫీ కప్పు.

ఏమండీ మీరెందుకిలా ఎప్పుడూ బెంగతో అందోళనతో వుంటారు. ఒక్కనాడైన హృదయము విప్పి మాట్లాడలేదు. సంతోషమనేది ఎటువంటిదో తెలియదు. నాలో ఏమైన లోపముందా... చెప్పండీ!

రవినుండి సమాధానము లేదు. ఈ ప్రశ్న ఎన్నో మార్లు వేసింది. సమాధానము మామూలే...

రాధ చేసేదిలేక 'మాగ్‌జిన్' తిరగవేస్తు రేడియో ఆన్ చేసింది.

'జన్మమెత్తితిరా అనుభవించితిరా
బ్రతుకు సమరంలో పండిపోయితిరా?

అన్న పాట గంభీరముగా మొదలిడింది. ఆ పాటతో రవి గత జీవితము జ్ఞప్తికివచ్చి హృదయము కలికింది. రవికి చెమటలు పోశాయ్. ఆ వేదనతో మనసు క్రుంగిపోయింది. తీరని బాధ ఆవరించింది. రా-ధా... కేక వేశాడు. స్పృహ తప్పింది.

రాధలో భయము కమ్ముకొంది. కాలు చేతులు చల్లబడ్డాయి. బలహీనతలాగుంది. గుండెలు వేగముతో కొట్టుకోసాగినాయ్. తడబడే అడుగుల్లతో, ఆత్రుతతో వంటింట్లోనికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి మొహాన చిలకరించింది. రవి కనులు తెరచాడు. రాధా నీకు తీరని ద్రోహము చేశాను నన్ను క్షమించు.

ఏమిటండీ మీ మాటలు మీరప్పుడప్పుడు యిలాగే అంటుంటారు. మీరు నాకేమి ద్రోహము చేశారని... అనవసరంగా ఎందుకు కంగారుపడతారు.

అయితే నామీదే నమ్మకముందా రాధా... పెల్లుబికిన ఆనందముతో అడిగాడు రవి.

\+ \+ \+

'ముమ్మాటికీ మీమీద నమ్మకముంది,'

రాధ నీకుమాత్రము నామీద నమ్మకముంది. కాని నామీదే నాకు నమ్మకములేదు. నిన్నెప్పుడూ మౌనముతో దహిస్తు, సంతోషమనేది లేక నీకొక పెనుభూతమై పీడిస్తున్నానుకదూ...

ఔను రాధ జీవితములో రవి యొక పెనుభూతమని చెప్పొచ్చు. కాని రవి జీవితములో రాధ జీవనజ్యోతి రవి కలిగిన యింటివాడు. చిన్నప్పుడే అందరిని పోగొట్టుకొని ఒంటరివాడై వ్యసనాలకు గురియైన సమయంలో పురాతనముగ వారింటిని నమ్ముకొన్న శాస్త్రిగారు రవిని ఎలాగైన కాపాడదలచి ఒక యింటివాన్ని చేయాలనుకొని యీ సంబంధం కుదుర్చాడు.

అప్పట్లో రాధ తండ్రి ఐదుగురు ఆడపిల్లలతో, అప్పులతో, కట్నాలతో బాధపడుతు పెళ్ళీడు వచ్చినా ఎవరికి పెళ్ళిచేయలేక పోయాడు. పెద్దమ్మాయి రాధ. కట్నంలేకుండ రవికిచ్చి పెళ్ళిచేస్తే వధువుకు కానుకగ పాతిక వేలు యిస్తాడనటములో రాధ తండ్రి హర్షముతో ఒప్పుకొన్నాడు.

ఎట్టివారికైన జీవితములో ఆశలు, ఆశయాలుంటాయ్. సాధించలేనివైన సాధించాలని తమ కలలు నిజము కావాలని కుతూహలపడుతుంటారు. జీతములో ఒకేసారి జరిగేది మళ్లీ మళ్ళీ జరగనిదీ పెళ్ళి. ఆ పెళ్ళి ప్రతి ఒకరి జీవితములోన జీవితాంతము మరచిపోని పండుగ. ఆ పండుగకోసం యెట్టి నిరుపేదలైన భాగవంతులైన యెదురుచూస్తుంటారు. ఆ రోజు ఆనందపుటంచులు చూడాలని, కోరిక శిఖరాలు పయనించాలని, మబ్బుల విమానంలో ప్రణయ విహారముచేయాలని కుతూహలపడుతు యెదురు చూస్తుంటారు. రాధ కూడ అలాగే అనుకొనేది.

పుట్టినింటిలో పడిన బాధలు తొలగి మెట్టినింటిలో కనీసం భర్త అడుగుజాడల్లో సంతోషపడతా ననుకొంది.

కాని రవి ధనవంతుడని, తప్పత్రాగి తిరుగు, అసహ్యముగ, అసభ్యముగ ప్రవర్తిస్తుంటాడని ఊరువాడు వ్రాసిన విషయం రాధకు కూడ, తెలిసింది.

తన జీవితములో ఆనంద సుమము విరియదు. అనురాగ మధువు జిమ్మదు. హృదయ వీణ పలుకదు. జీవన జ్యోతిలో వెలుగుండదు. అని కుమిలిపోయింది. ఆత్మహత్యకు పూనుకొంది. కాని దీర్ఘముగా ఆలోచించింది. పాతికవేలు కట్నం. మిగిలిన చెల్లెండ్రకు పెళ్ళిచేయవచ్చు. కట్నము బాధ్యత తీరిపోతుంది. తన జీవితము బాగుపడకున్నా తండ్రిని ఆదుకొనుటకు, చెల్లెండ్ర భవిష్యత్తు కాపాడుటకు పెద్దదానిగ తన కర్తవ్యము నెరవేర్చాలనుకొన్నది. తన కాపురాన్ని సరిదిద్ది నలుగురిలో నిలబడా లనుకొన్నది.

శుభలగ్నమందు రవి, రాధల పెళ్ళి వైభవముగ జరిగిపోయింది. ఆరోజు రాత్రి గదంతా అలంకరించారు. మల్లెలవాసనలతో అగరవత్తుల ధూమముతో గది కళ కళ డుతూంది. రాధ యెదురు చూస్తున్న మహత్తర పండుగ, జీవితమున తొలి మలుపునకు నాందిగ రానేవచ్చింది. ప్రణయ సుధారస పొంగులలో తేలిపోతాననుకొన్నది. రాధను గదిలోకి కొందరు స్త్రీలు తీసికొచ్చి వదలి తలుపులు మూశారు. సాంప్రదాయమైన హైందవ స్త్రీకిగల సిగ్గుల ఆభరణమున నలంకరించుకొని తలుపుదగ్గరే నిలబడింది. జీవితేశ్వరుడు వస్తాడని, కౌగిల్లోకి తీసుకొంటాడని ఊరిస్తాడని మధురానుభూతి పొందింది.

కాని రవి కిటికిలోనుంచి ఆకాశంలోనికి చూస్తు రాధ వచ్చినట్లు గుర్తించలేదు. కొన్ని నిముషాలు మౌనము గదంతా ఆక్రమించుకొంది. రాధ కళ్ళ వెంబడి నీరు నాగార్జునసాగర్ కుడికాలవలా ప్రవహించింది. ఆమె నిర్మించుకొన్న ఆశాసౌధము ప్రారంభోత్సవ సమయములో కూలిపోయిన వంతెనలా సర్వనాశన మయ్యింది. గుండెల్లో సుడిగుండాలు ఘోషించాయి. తనువున్నట్లు శబ్దముచేసి గుర్తును తెచ్చింది. లాభములేదు. తనే ధైర్యముచేసి రవి దగ్గరకు వెళ్ళింది. తన బాధనంత కన్నుల్లో వెలిబుచ్చింది.

నన్ను క్షమించు...అంటూ దూరముగా జరిగాడు. అంతే ఆ రాత్రి అలాగే గడచిపోయింది.

రాధ రవిని ఎలాగైన మార్చాలి, అతనిలా ఆగుటకు కారణాలేవో వుంటాయనుకొని తెలుసుకోవాలని తన బాధనంత దిగమ్రింగుకొంది. రవి యిప్పుడు త్రాగడు. అసభ్యముగ ప్రవర్తించడు. ఒక్కొసారి రాధ వైపు అమాయకముగ, తప్పుచేసిన వాడిలా చూస్తుంటాడు. అలా చూసినపుడు రాధ బాధపడేది.

రవిని బాగా అర్థము చేసికొంది రాధ. రవి యిప్పుడు యెలాంటిపనులు చేయడంటే, అప్పుడతని పరిస్థితులు, అతనిలోవున్న వ్యక్తులు కారణం. అయిన యేదో బలమైన కారణ ముందనుకొంది.

ఒకరోజు రాధ ధైర్యము తెచ్చుకొంది. ఏమండీ! మీరు నాపట్ల ఎప్పుడూ అసభ్యముగ ప్రవర్తించలేదు. మిమ్మల్ని అర్థం చేసుకొంటే చాలమంచివారు. పరిస్థితులు, వ్యక్తులే మిమ్మల్ని మార్చిందనిపిస్తుంది. అయినా మీరేదో తప్పుచేసిన వాడిలా బాధపడుతుంటారెందుకని అడిగింది.

రవి కన్నులు మెరిశాయి. హృదయంలో ఆశ పొడచూపింది. రా...ధా...ఈ నాటికి నన్ను బాగా అర్థము చేసుకొన్నావు రాధ. నీవు చెప్పినదంతా నిజం. ఇంత మంచిదానవైన నీకు యిన్నాళ్లుగ ఏ ఆనందము అందివ్వలేక మహాపాపం చేశాను. నన్ను క్షమిస్తే... రవి ఆత్రుతతో బీరువ తెరచి తన 'డైరీ' అందించాడు.

నాకెందుకండీ మీ 'డైరీ' అన్నది నవ్వుతూ. కాదు రాధ నువు తప్పక చదవాలి. నన్ను క్షమించాలి అని దీనముగా చూచాడు.

...నా జీవితములో ముఖ్య సంఘటనలు......

25_5_1958 S. S. L. C- పరీక్ష ఫలితాలు వచ్చాయి. నేను ఉత్తీర్ణుడయ్యాను. అమ్మతో చెప్పగా ముద్దాడి ఆనంద బాష్పాలు రాల్చింది. తర్వాత అమ్మతో కలసి వెంకటేశ్వరుని గుడికి పోయి అభిషేకము చేయించాము. ఈ రోజు హృదయము ఆనందముతో ఉరకలు వేసింది.

5_7_58 కాలేజి (కళాశాల) లో చేరాను. కాలేజికి వెళ్ళేముందు అమ్మ ఆశీర్వదించి దేవుని ప్రసాదం యిచ్చింది. రవి ఎల్లప్పుడు దేవుని నమ్ముకో! నీకు మేలు చేస్తాడని చెప్పింది.

15_10_58 సురేంద్ర, జగదీష్‌లతో కారులో షికారుకి వెళ్ళాము. నాచేత బలవంతముగా సిగరెట్లు కాల్పించారు. ఈ రోజంతా నాకేదో మత్తుగా వుంది.

20_8_59 అమ్మ చనిపోయిందని వార్త వచ్చింది. రేపే పరీక్షలు నేనేమి చేయగలను. భగవాన్, నాకెందుకీ శిక్ష విధించావ్ నేనేమి తప్పుచేశాను. అంతానీ లీల.

8_9_59 దారిలో ఒక బిక్షగాడు బాబూ పైసా ధర్మము చెయ్యండి. ప్రక్కొడు గంజి త్రాగి మూడు రోజులౌతున్నదని అస్థి పంజరములావున్న శరాన్నిరీ పోషించుకొనేందుకు అర్థిస్తున్నాడు. నాకు జాలివేసింది. దురూపాయిల నోటుయిచ్చాను. ఆకలితో రగులుతున్న వి

ఒక జీవి ఆకలి తాత్కాలికముగ తీర్చగలిగాను. ఈ రోజు నాకెంతో ఆనందముగ, హాయిగ వుంది.

9-11-59 తోటిమిత్రుడు మొదటివి. ఏ పరీక్షకు ఫీజు చెల్లించలేకపోయాడు. నా మనస్సెంతో బాధ పడింది. భగవంతుడిలా మానవులకు వివిధపాత్రలు కల్పించి ఎందుకు నాటకమాడిస్తున్నాడో యని వగచాను. అతనికి సహాయము చేశాను.

25-5-60 'హనీమూన్'కు క్యాంపు వేశాము. కోడి బిరియాని తయారుచేయించాము. బ్రాందీ కూడ తెప్పించాము. నాకు బాగా త్రాగించారు. మంచి మత్తులో వున్నాను. రంజనిచేత డాన్సుచేయించారు.

12-10-60 నామిత్రులతో పేకాట ఆడాను. ఐదు వందల రూపాయలు పోగొట్టుకొన్నాను. ఇంక ఆడకూడదని లేవబోయాను. మత్తులోవున్న నాదగ్గరనుండి వున్న రెండు వందలు కాజేశారు.

4-4-61 మిత్రులను రప్పించి తప్ప త్రాగి యింటిలో నళిని డ్యాన్సు చేయిస్తు నానాపాట్లు పడుతున్నాము. రామయ్య వచ్చి ఏంబాబు యిదంతా అంటేటే చెంప చెల్లుమనిపించాను. రామయ్య యింటితాళము చేతులు యిచ్చి వెళ్లిపోయాడు. మత్తువదలిన తర్వాత బాధ పడ్డాను.

27-17-61 రాత్రి 9-30 గంటలకు ప్రభాకర్ సినిమాకని తోడుపెట్టుకొని వెళ్ళి 'లాడ్జి'కి దారికి తీశాడు. నేను రాలేదన్నాను. కాని లాభము లేకపోయింది. అతను రాడీరకము. పేచీలు వేసేందుకు ధైర్యము లేకపోయింది.

12-5-62 నళిని, నేను కారులో షికారుకు బయలు దేరాము. వేగహెచ్చి కారు బ్రిడ్జ్‌కి ఢీ కొనింది. చిన్న గాయాలు తగిలాయి. నళినికి ఏమీలేదు. నన్ను హాస్పిటల్‌లో చేర్చింది.

22-7-62 నళిని ఆత్మహత్య చేసి కొన్నదని వార్త తెలిసింది. నన్ను హాస్పిటల్లో అడ్మిట్ చేసిందని స్నేహితులు హేళనచేశారని ఈ అఘాయిత్యానికి పూనుకొన్నదట. ఈ అవమానం సహించ లేకపోయాను. నేనుకూడ ఆత్మహత్యకు పూనుకొన్నాను. కాని ధైర్యము లేకపోయింది.

1-12-63 నాలో కామం కట్టలు త్రెంచుకొంది. నరాలు జివ్వుమన్నాయి. ఇక కామదాహానికి ఆగలేక చేరవలసినచోటు చేరాను. అవిడ మూలుగుతున్నది. అదోలా బుసకొడుతున్నది. అపుడు రొమ్ములు ఊపిరికి పడుతున్నవి. అదంతా చూచి విరహవేదనతో చేష్టలు చేస్తున్నదనుకున్నాను. నాలో ఉద్రేకము పొంగి ఆమె మీదికి వాలాను...ప్రతి ఫలముగా పాలిండ్లు నా ముఖాన్ని తడిపాయి. కనులు తెరచి మత్తువదిలాను. నేను చేసిన తప్పు మహాఘోరమని గుర్తుకొచ్చింది. అచట నిలువలేక పోయాను. అమ్మ నేనూ కలసి వెళ్లిన గుడికి వెళ్ళి దేవునిమీద ఒట్టువేసుకొని ఇంకెన్నడు యిలాంటి పనులు చేయనని పశ్చాత్తాప పడ్డాను.

16-6-64 నా పెళ్ళి జరిగింది రాధతో. మొదటి రాత్రే నేను ఆమెకు చేయరాని ద్రోహముచేశాను. ఆమెను కామాగ్ని జ్వాలలతో దహింపజేసి నిర్మించుకొన్న ఆశాసౌధానికి పునాది సహితంలేకుండ నాశనము చేశాను. యవ్వన సామ్రాజ్యములో కలతలు రేపాను. నేను మహాపాపిని.

27-11-64 ఏమండీ మీరెందు కిలా వున్నారు. చెప్పండీ నాలో ఏమైన లోపముందా? అని మొదటి సారిగా కలిగిన గుండెలలో దీనముగ అడిగింది రాధ కాని జబాబు......

2-3-65 రాధకు నేను ఏ ఆనందము అందివ్వలేక పోయినా ఆమె మాత్ర నా నిత్యవసరాలు తీరుస్తు నన్నెంతో మార్చింది ప్రవర్తనతో నా అంధకార జీవితమునకు వెలుగు చూపించింది. ఆదరించి సుడిగుండాలు నుండి రక్షించింది. బ్రతుకును పూలబాటలో నడిపిస్తున్నది. అన్నివిధాల రాధ నాకు దేవత.

రాధ ఇదంతా చదివి కన్నీళ్ళు కార్చింది.

రా...ధా...నా జీవిత చరిత్రను చూచి ఏడుస్తున్నావా? ఇంకైన నన్ను క్షమిస్తావు కదూ!

అంతమాట అనకండీ. నాకు చిన్నప్పటినుండి ధనవంతులంటే ఈర్ష్య. మదాంధులని, కన్ను మిన్ను తెలియక యిష్టమొచ్చినట్లు, చెలాయిస్తారని ధగాకోరులని, మోసగాండ్రని మీరుకూడ ఆ కోవకు చెందినవారని తలచి కుమిలిపోయాను. కాని ధనవంతులలో కూడ మీలాంటి గుణవంతులు నూటికో కోటికో ఒక్కరుంటారనీ యీనాడు పూర్తిగా విశ్వసిస్తున్నాను. నన్ను క్షమించాలి...అన్నది.

రా...ధా...ఎవరు నెవరూ క్షమించ నక్కరలేదు జరిగినకథ పీడ కలగా మరచిపోదాము. ఈనాటినుండి ఇద్దరు ఒక్కటై జీవితము గడుపుదామని ముందుకు సాగాడు రవి హృదిలో వేయి కోయిలమ్మలు పాడగా. అలాగే స్వామీ! అంటూ కోటివసంతాలు పూచిన హృదయములో రాధ ముందుకు సాగింది.

దూరమునుండి 'మబ్బులు తొలగెనులె - మనసులు వెలిగెనులె' అనుపాటను గాలి కెరటాలు వినిపింప జేశాయి.